క్లుప్తంగా

తెలంగాణ డీఎస్పీగా మంగళకుంట యువతి



తర్లుపాడు: మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన పిన్నిక ప్రశ్న తెలంగాణ టీజీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ చాటి డీఎస్పీగా ఎంపికయ్యారు. రిటైర్డ్ అడిషనల్ డీజీపీ హరి ప్రసాద్, దివంగత గ్రామ సర్పంచ్ పిన్నిక శారద దంపతుల కుమార్తె ప్రశ్న విద్యాభ్యాసం హైదరాబాద్‌లో సాగింది. డీఎస్పీగా ఎంపికైన ఆమెను గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా తాటిచెర్లమోటు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. తాటిచెర్ల రూరల్ ఫీడర్, తాటిచెర్ల అగ్రికల్చరల్, ముత్రాసుపల్లె, హసనాపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: మండలంలోని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈనెల 22వ తేదీ నుంచి వార్డు సచివాలయాలు, ఆన్‌లైన్ సెంటర్లలో డిజిటల్ వర్క్స్, ఫొటోషాప్, ఫ్లెక్సీ ప్రింటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇప్పిస్తున్నట్లు వివరించారు. అక్టోబర్ 1వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

గొడ్డు కాదిది నా బెడ్డు!



పడుకుని విశ్రాంతి తీసుకుంటున్న గేదెపై దర్జాగా కూర్చుని ఠీవీ ఒలకబోసింది ఓ వీధి శునకం. గిద్దలూరు పట్టణంలోని రాజానగర్‌లో కనిపించిన ఈ దృశ్యాన్ని చూసి స్థానికులు కాసేపు ఆశ్చర్యపోయారు. వీధి కుక్కకు గొడ్డు బెడ్డుగా మారిందని చర్చించుకున్నారు.

– గిద్దలూరు రూరల్

పండగ పూటా పస్తులేనా?

- పాఠశాలలు తెరిచినప్పటి నుంచి ఆయాలకు అందని వేతనం
- గిద్దలూరు నియోజకవర్గంలో 324 మంది ఆయాలు



మల్లాపురంలో మరుగుదొడ్లు

మండలం	పాఠశాలల్లో ఆయాల సంఖ్య
బేస్తవారిపేట	61
కంభం	43
అర్ధవీడు	47
గిద్దలూరు	77
కొమరోలు	51
రాచర్ల	45



వంగపాడులో పాఠశాలను శుభ్రం చేసిన ఆయా

బేస్తవారిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల(ఆయా)కు ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వేతనం మంజూరు చేయలేదు. నెలల తరబడి వేతనం అందకపోవడంతో అప్పులు చేయలేక.. పస్తులు ఉండలేక దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పండుగ రోజుల్లోనూ కుటుంబాలతో పస్తులుండాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ కావడంతో వేతనం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు సంకల్పించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించింది. వాటి నిర్వహణకు ప్రత్యేకంగా ఆయాలను నియమించింది. తరగతి గదులను శుభ్రంగా ఉంచడంతో పాటు రోజూ మరుగుదొడ్లు శుభ్రం చేసేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం అవసరమైన మెటీరియల్ పంపిణీ చేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు మరుగుదొడ్ల సమస్య తీరడంతోపాటు అనేక మందికి ఉపాధి లభించింది. ఆయాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెలకు రూ.6 వేల చొప్పున ఇచ్చిన వేతనాన్ని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది నిలిపేసింది. పెరిగిన ధరలతో వేతనం చాలడం లేదని, అది కూడా నెలనెలా సక్రమంగా రావడం లేదని ఆయాలు ఆవేదన చెందుతున్నారు.

నియోజకవర్గంలో 324 మంది

పాఠశాలలో 300 మంది విద్యార్థులుంటే ఒకరు, 600 మంది వరకు ఇద్దరు, ఆపైన విద్యార్థులున్న పాఠశాలలకు ముగ్గురు ఆయాలను గత ప్రభుత్వంలో నియమించారు. ఆయాలు రోజూ మరుగుదొడ్లు శుభ్రం చేయడంతోపాటు, తరగతి గదులు, పాఠశాల ఆవరణ శుభ్రం చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 324 మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తున్నారు.

సక్రమంగా అందని వేతనం

అతి తక్కువ మొత్తంలో వేతనం తీసుకుంటున్న ఆయాలకు ప్రభుత్వం మూడు, నాలుగు నెలలకోసారి నగదు ఇస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలీచాలని వేతనంతో కుటుంబాలను నెట్టుకొస్తున్న వారికి ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వం పైసా చెల్లించలేదు. దీంతో చేతిలో చిల్లి గవ్వలేక పండగ ఎలా చేసుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. వేతనం సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

> ఈ ఏడాది బడి తెరినప్పటి నుంచి వేతనం చెల్లించలేదు. అసలే చాలీచాలనీ వేతనం. అది కూడా నెలనెలా ఇవ్వకపోతుండటంతో ఇంటి ఖర్చుకు డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నాం. దసరా పండగకు సరుకులు కొనడానికి తెలిసిన వారి దగ్గర అప్పు చేయాల్సి వస్తోంది. మా ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జీతం విడుదల చేయాలని కోరుకుంటున్నాం.
>
> – ఎం.పార్వతి, ఆయా, శింగరపల్లె హైస్కూల్

వైఎస్సార్ సీపీ నేతకు ‘అన్నా’ ఘన నివాళి



రామకోటిరెడ్డి భౌతికకాయంపై పార్టీ జెండా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా



రత్నమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల

బేస్తవారిపేట: స్థానిక రెడ్డినగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొణతం రామకోటిరెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు ఆదివారం రామకోటిరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు, పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, నాయకులు పి.ఈశ్వరరెడ్డి, ఎం.చంద్రశేఖరరెడ్డి, కొండా రఘునాథరెడ్డి, బొగ్గు శ్రీహరి ఉన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామానికి చెందిన పొదిలి వెంకటసుబ్బయ్య భార్య ఆదిలక్షమ్మ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి నివాళులర్పించారు. ఆమె కుమారుడు పొదిలి రంజిత్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉప్పుటూరి పెదవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



విజేతలను సన్మానిస్తున్న హరిహరరావు, శాస్త్రి తదితరులు

మార్కాపురం: ఇటీవల విడుదల చేసిన వివిధ పరీక్షా ఫలితాల్లో బ్రాహ్మణ విద్యార్థులు ఉద్యోగాలు సాధిచడం అభినందనీయమని సాయిబాబా మందిర వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు, ఎన్జీఓ సంఘ తాలుకా అధ్యక్షులు డాక్టర్ బి.శ్రీనివాసశాస్త్రి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసాయి ఫంక్షన్ హాల్లో ఉద్యోగాలు సాధించిన బొడ్డుపల్లి జ్యోతి, గోపాలుని రాజరాజేశ్వరి, త్రిపురారిబట్ల సౌమిత్రి, కుంచాల రాజేష్‌ను పలువురు బ్రాహ్మణ ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ప్రణాళిక ప్రకారం కష్టపడి చదవటం వల్లే టీచర్లు, పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైనట్లు ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో కమలపురి శ్రీనివాసరావు, దూళిపాళ మధు, బద్వేటి రమణారావు, వాలిచర్ల శేషసాయి, బొడ్డుపల్లి గోపాలకృష్ణ, సోమయాజుల సుబ్బశాస్త్రి, భాస్కర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- జేడీఏ శ్రీనివాసరావు



వరి నాట్లను పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు

కొనకనమిట్ల: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం కొనకనమిట్లలో సాగు చేసిన పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. జేడీఏ మాట్లాడుతూ.. రైతులు పంట సాగు చేసిన తరువాత ఈక్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వైట్‌బర్లీ పొగాకు పండించే రైతులు కచ్చితంగా టుబాకో బోర్డు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా వైట్ బర్లీ సాగు చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ బాలాజీ నాయక్, ఏఓ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

జాషువా కళాపీఠం తొలి కార్యవర్గం ఎన్నిక



జాషువా, భగత్ సింగ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పొదిలి: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గుర్రం జాషువా కళాపీఠం తొలి కార్యవర్గాన్ని ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేవీ రమణారెడ్డి, అధ్యక్షుడిగా కల్లం వెంకట సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మువ్వల పార్థసారథి, ఉపాధ్యక్షుడిగా వరికుంట్ల వినోద్ రాజు, జి.శ్రీను, జి.రమణారెడ్డి, కార్యదర్శిగా బండి అశోక్, సంయుక్త కార్యదర్శిగా పుల్లయ్య, యుద్ధం ఆదినారాయణ, కోశాధికారిగా యక్కలి శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులుగా కర్ల వీరబ్రహ్మం, తాళ్లూరి ఆల్‌ఫ్రెడ్, కాటూరి శ్రీను, అట్లూరి రామారావు, పులివెలుగుల సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముందుగా జాషువా, భగత్‌సింగ్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

- వివిధ ప్రాంతాల్లో 13 మంది జూదరులు అరెస్టు
- నిందితుల నుంచి రూ.40950 స్వాధీనం

తర్లుపాడు/గిద్దలూరు రూరల్/కొమరోలు: వేర్వేరు ప్రాంతాల్లో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తర్లుపాడు మండలంలోని కేతగుడిపి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.1,670 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గిద్దలూరు మండలంలోని పొదలకుంటపల్లె గ్రామ శివారులో గల ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. నిందితుల నుంచి రూ.13,800 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.

కొమరోలు మండలంలోని తంబళ్లపల్లె గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. నిందితుల నుంచి రూ.25,480 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న పిచ్చిరెడ్డి, నాగరాజు గౌడ్

మార్కాపురం: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అటవీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మార్కాపురం అటవీశాఖ ఎఫ్ఆర్ఓ పిచ్చిరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజుగౌడ్ ప్రజలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలోని వివిధ వీధుల్లో అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. జింకలు, నెమళ్లు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా వన్య ప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు, అసిస్టెంటు బీట్ ఆఫీసర్లు రవికుమార్, బాలాకుమారి, ఏడుకొండలు, ధనలక్ష్మి, రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాగాలి ఈ స్నేహం.. కలకాలం

- ఆద్యంతం ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



గిద్దలూరులో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్: ఐదున్నర దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న వారు ఆదివారం కలుసుకున్నారు. ఆప్యాయంగా పలుకరించుకుని, కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ అపూర్వ సమ్మేళనానికి గిద్దలూరులోని కొంగలవీడు రోడ్డులో గల విశ్వభారతి స్కూల్ ఆవరణ వేదికైంది. పట్టణంలోని వివేకానంద హయ్యర్ సెకండరీ పాఠశాలలో 1969–70 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకేచోట చేరి ఉత్సాహభరిత వాతావరణంలో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు లంకా సత్యనారాయణ, అచ్చిరెడ్డి, ఎం.వీరారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి ఎం.వెంకటసుబ్బయ్య పేద విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొమ్మినేని బాలయ్య, మురళీకృష్ణ, రామచంద్రారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, పిడత రామిరెడ్డి, డాక్టర్ ప్రసాద్, సుబ్బారెడ్డి, ఖాదర్‌వలి, బలరామిరెడ్డి, వెంకటరామిరెడ్డి సహా 38 మంది పాల్గొన్నారు.

వేములకోట హైస్కూల్లో..



మార్కాపురం వేములకోట స్కూల్లో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

మార్కాపురం: మండలంలోని వేములకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. సుమారు 20 ఏళ్ల క్రితం తాము చదివిన పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా ముచ్చటించుకున్నారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుని సందడి చేశారు. ప్రస్తుత హెచ్ఎం వై.సుబ్బారెడ్డి, అప్పటి హెచ్ఎం అనివిలాసిని, ఉపాధ్యాయులు మహేశ్వరరెడ్డి, అంజనేయరెడ్డి, చలపతిరావు, వీర నారాయణరెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు.

దేవీ పాహిమాం




బేస్తవారిపేట : మహాలక్ష్మీదేవిగా చౌడేశ్వరీదేవి



బేస్తవారిపేట : లలిత త్రిపుర సుందరీదేవిగా కోటసత్యమాంబదేవి



గిద్దలూరు : వాసవీమాత ఆలయంలో అన్నపూర్ణ అలంకరణలో అమ్మవారు



అర్ధవీడు : అంకభూపాలెంలో పోలేరమ్మకు నిమ్మకాయలతో అలంకరణ



బేస్తవారిపేట : లలితాదేవిగా వాసవీమాత




గిద్దలూరు : కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శరన్నవరాత్రి వేడుకలు రంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారి మూలవిగ్రహమూర్తులు, ఉత్సవ విగ్రహాలు, ప్రతిమలను ఏడో రోజు ఆదివారం వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చండీ హోమాలు, సామూహిక కుంకుమార్చన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో అన్న సంతర్పణ చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీలు, దేవదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



మార్కాపురం : అమలక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సంతానలక్ష్మి అలంకారంలో..



మార్కాపురం : గాయత్రీదేవిగా వాసవీమాత



మార్కాపురం : కాత్యాయిని మాతగా జగదాంబ అమ్మవారు



మార్కాపురం : వేదవల్లి అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు



గొట్లగట్టు రామాలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా..



అర్ధవీడులో మహాచండీదేవికి పూల అలంకరణ